మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## రాష్ట్రస్థాయిలో అబాకాస్‌లో.. అల్వాల విద్యార్థినికి రైజింగ్ స్టార్ అవార్డు



అవార్డు అందుకుంటున్న విద్యార్థి

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని విశ్వంఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించిన అబాకాస్ వేదిక్ మ్యాథ్స్ 2026 స్టేట్ లెవెల్ కాంపిటీషన్లో మండల పరిధిలోని అల్వాల గ్రామంలోని భాగ్యలక్ష్మి విద్యాలయానికి చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయిలో రైజింగ్ స్టార్ అవార్డు పొంది విజేతగా నిలిచింది. రాష్ట్రస్థాయిలో రైజింగ్ స్టార్ అవార్డు సాధించడంతో పాటు అబాకాస్ డైరెక్టర్ వినయ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో రైజింగ్ స్టార్ అవార్డు సాధించడం పట్ల పాఠశాల హెచ్‌ఎం రావర్ల నర్సయ్య, ఉపాధ్యాయులు అభినందించారు. అవార్డు సాధించడం పట్ల గ్రామం లోని విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

## కిటకిటలాడిన మల్లన్న ఆలయం

**భారీగా తరలివచ్చిన భక్తులు**

**కొమురవెల్లి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి జాతరలో భాగంగా ఆదివారం భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గుట్టపైనున్న రేణుక ఎల్లమ్మకు పట్నాలువేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వెంకటేశం తగు ఏర్పాట్లు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించారు. స్వామి వారి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, ఒగ్గు పూజారులు,సేవాసమితి సభ్యులు, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు




ఎన్నికల సామాగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

## పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలి

**జిల్లా కలెక్టర్ హైమావతి**

**చేర్యాల,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** ఈనెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికలను పకడ్బందిగా నిర్వహించాలని,పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్,ఎన్నికల అధికారి కె.హైమావతి తెలిపారు.ఆదివారం పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాలలో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్,రిసెప్షన్ సెంటర్,కౌంటింగ్ హాల్,స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు.పోలింగ్ రోజు సిబ్బందికి ఉదయం టిఫిన్,మధ్యాహ్నం భోజనం,సాయంత్రం స్నాక్స్ అందించాలని పోలింగ్ సమయం ముగిసిన తరువాత గురుకులంలో రిసెప్షన్ ప్రక్రియ సైతం సజావుగా జరపాలని తెలిపారు.రిసెప్షన్ పూర్తి కాగానే బ్యాలెట్ బ్యాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలని,13వ తేదీన కౌంటింగ్ ఉన్నందున 12న కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.కౌంటింగ్ సిబ్బందికి ఏజెంట్లకు పరిమితంగా పాస్‌లు అందజేయాలని ఏజెంట్లకు ,కౌంటింగ్ సిబ్బందికి వేరు వేరుగా సెంటర్‌లోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చెయ్యాలన్నారు.కౌంటింగ్ ప్రక్రియ జరిగేటప్పుడు వెబ్ కెమెరాలు ప్రతి ఒక్కటి రికార్డ్ కావాలన్నారు.మున్సిపాలిటీలో ఎన్నికలు సజావుగా పూర్తి చేసే బాధ్యత మున్సిపల్ కమిషనర్ నాగేందర్‌దేనని ఆదేశించారు.

## .నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు

**ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలో ..మద్యం, కల్లు దుకాణాలు మూసి వేయాలి**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న హుస్నాబాద్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, చేర్యాల, దుబ్బాకలో ఈనెల 9న సాయంత్రం 5 గంటల నుంచి ఈనెల 11న పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు మద్యం,కల్లు దుకాణాలను మూసి వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ అలాగే ఈనెల 13న ఓట్ల లెక్కింపు సందర్భంగా లెక్కింపు ప్రక్రియ పూర్తి అయ్యే వరకు జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలో మద్యం, కల్లు దుకాణాలు మూసి వేయాలన్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు మున్సిపాలిటీలలో గల మద్యం దుకాణాలను మూసి వేయాలన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ హైమావతి

## ఎలక్షన్ వచ్చే.. కలెక్షన్ తెచ్చే..

**..మున్సిపల్ ఎన్నికల్లో ఆటో వాళ్లకు ఉపాధి...**

**..ఖేడ్ మున్సిపాలిటీలో సుమారుగా 40 ఆటోలు వినియోగం**

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎలక్షన్ రావడంతో అటు వైన్ షాపులకు, హోటళ్లకు, ప్రింటింగ్ ప్రెస్ వాళ్లకు ఫుల్లు గిరాకీ మొదలైంది, దీంతోపాటు సాధారణంగా ఆటో డ్రైవర్ ప్రయాణికులకు తరలించడానికి రోజుకు 500 నుంచి 600 రూపాయల వరకు సంపాదిస్తాడు. అయితే ప్రస్తుతం మున్సిపల్ ఎలక్షన్ ప్రచారం సందడి నెలకొన్నందున కొంతమంది ఆటో డ్రైవర్లకు ప్రత్యేక ఉపాధి దొరికింది.సందిట్లో సడేమియా అన్నట్లు నారాయణఖేడ్ పట్టణంలో ఎన్నికల ప్రచారానికి ఒక్కొక్క ఆటోకు రోజుకు 2000 అద్దె చెల్లించడంతోపాటు డ్రైవర్ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం,డిన్నర్ సైతం ఏర్పాటు చేస్తున్నారు. నారాయణఖేడ్ పట్టణంలో సుమారుగా 40 ఆటోలతోపాటు మరో 2 ఇతరవాహనాలు ఎన్నికల ప్రచారం కోసం ఉపయోగిస్తున్నారు.ఏది ఏమైనప్పటికీ మున్సిపల్ ఎలక్షన్ రావడంతో ఆటోలతో పాటు మైక్ యాజమాన్యాలకు సైతం ఉపాధి లభించింది.



జంగమయ్య గుట్టలో పార్వతిపరమేశ్వరుల కళ్యాణం దృశ్యం

## జంగమయ్య గుట్టలో ... అంగరంగ వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

**సదాశివపేట,ఫిభ్రవరి 8 (ప్రభాతవార్త):** సదాశివపేట మండలం తంగడపల్లి గ్రామంలోని శ్రీ కోటి బిల్వ లింగేశ్వర మఠం , శ్రీ గురు గంగాధర మహాస్వామి ఆశ్రమం, జంగమయ్య గుట్ట 30 వ వార్షిక మహోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 2 నుండి 8 వరకు సప్తాహ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. విశేషంగా ఏడవ రోజు జంగమయ్య గుట్టలో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు శ్రీ శ్రీ శ్రీ శివయోగి శివాచార్య మహాస్వామి అన్నారు.గురువర్యులు మాట్లాడుతూ ఈసారి విశేషంగా కళ్యాణ మహోత్సవము నిర్వహించడానికి కళ్యాణ వేదిక నిర్మించినటువంటి బెజగం నిర్మల జగదీశ్వర్ కుటుంబ సభ్యులతో కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరిగింది. మరొకరు క్యాసారం వినోద్ కుమార్ దంపతులు కళ్యాణసేవలో పాల్గొన్నారు అని అన్నారు.ఈ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని తంగేడుపల్లి గ్రామ భక్తులు గురువర్యులకు తులాభార సేవ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గురువర్యులు శ్రీశ్రీశ్రీ కొట్టురేశ్వర శివాచారి మహాస్వామి వారు మరియు సదాశివపేట మండల వివిధ గ్రామాల భక్తులు మరియు కర్ణాటక మహారాష్ట్ర భక్తులు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించి మహా ప్రసాదాన్ని స్వీకరించి గురు గంగాధర మహాస్వామి కృపకు పాత్రులు అయినారు.

## విధి నిర్వహణలో నిర్లక్ష్యం.. కానిస్టేబుల్ కె.రమేష్ సస్పెండ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** విధి నిర్వహణలో నిర్లక్ష్యం..పోలీసు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన కానిస్టేబుల్ కె.రమేష్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ సాధన రష్మీ పెరుమాళ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొమురవెల్లి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రమేష్‌ను హెడ్ క్వార్టర్స్‌లో విధులకు హాజరు కావాలని ఆదేశించిన సదరు కానిస్టేబుల్ విధులకు హాజరుకాకుండా ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరై క్రమశిక్షణారాహిత్యాన్ని ప్రదర్శించారు. కానిస్టేబుల్ రమేష్ విధులకు హాజరు కాని సమయంలో చేర్యాల మున్సిపాలిటీలో ఉన్నట్లు విచారణలో వెల్లడైనట్లు సీపీ వివరించారు. అతని భార్య చేర్యాల మున్సిపాలిటీ 2వ వార్డులో ఎన్నికల్లో పోటీ చేస్తుండగా అమెకు మద్దతుగా రమేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఆధారాలతో సహా నిరూపితమైందని తెలిపారు. బాధ్యతాయుతమైన పోలీసు వ్యవస్థలో ఉంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం రాష్ట్ర సివిల్ సర్వీసెస్(ప్రవర్తన నియమావళి, 1964లోని రూల్ 3 అండ్ 5(సబ్ రూల్ 4) ప్రకారం నేరం, అనైతికం, రాష్ట్ర సివిల్ సర్వీసెస్ నియమావళి 1991 ప్రకారం క్రమశిక్షణ చర్యలు పూర్తయ్యే వరకు రమేష్‌ను సస్పెన్షన్‌లో ఉంచుతూ సిసి ఉత్తర్వులు జారీ చేశారు.

## ఓటేస్తారో..కాటేస్తారో..

**..వెంట తిరిగినోళ్లంతా మనోళ్ళంటావా...**

**..అందరికీ జై జై ..సై సై ..అంటున్న ఓటర్లు**

**..రంగులతో సంబంధం లేకుండా అన్ని జెండాలు మోస్తున్న వైనం**

**..ఓటింగ్ లో ఏమి చేస్తారో అని అభ్యర్థుల్లో గుబులు..**

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** మున్సిపల్ ఎలక్షన్స్ ఓటింగ్ దగ్గరికి సమీపిస్తున్న కొద్ది కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి, స్వతంత్రులు అభ్యర్థులు ఎవరైనా.. ప్రచారం ఎక్కడైనా జనాలు తండోపతండాలుగా వస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలకు జై కొడుతున్నారు. అభ్యర్థికి మద్దతుగా నినాదాలు చేస్తున్నారు.అన్న నా ఓటు నీకే, అమ్మ మా వాళ్లంతా నీకే ఇస్తాం ఓటు,ఇంతవరకు బాగానే ఉన్నా.. అసలు సమయంలో ఎటు వైపు ఉంటారో తెలియని పరిస్థితి. ఓటర్ నాడీ తెలియక అభ్యర్థులు ఆందోళన గురవుతున్నారు.ప్రచారానికి ఇంటి దగ్గరకి వెళ్లి ఓటర్లను వేడుకుంటున్నప్పుడు కొన్నిచోట్ల రెస్పాన్స్ రాగా,మరికొన్ని చోట్ల రెస్పాన్స్ రాక పోవడంతో అభ్యర్థులు ఓటర్లు ఓటేస్తారో కాటేస్తారో.. తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయావార్డుల్లో పోటీ చేస్తున్న అన్ని పార్టీల అభ్యర్థులు భయాందోళనలకు గురవుతున్నారు. ర్యాలీలు, ప్రచారానికి వెళ్లినప్పుడు వస్తున్న జనమంతా మనవారేనా?వెంట వచ్చినవారు, మనకే ఓటు వేస్తారా? అన్న ప్రశ్నలు వారికి తికమక పెడుతున్నాయి. నామినేషన్ల ఘట్టం ముగిసి ప్రచారం మొదలైనప్పటి నుంచి మైకుల మోతలు, పాటల పరవళ్ళు, నినాదాల హోరు ర్యాలీలు సభలు, సమావేశాలు ఇలా అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నప్పటికీ, వెంబడి తిరిగిన వాళ్లంతా మనకే ఓటేస్తారా.. అన్న అనుమానాలు కొందరు అభ్యర్థులలో ఉన్నప్పటికీ,ఏమి ఏమి తోచని పరిస్థితి ఏర్పడింది. ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా ఆయా ప్రధాన పార్టీలు హామీల వర్షంతో ముంచేత్తుతున్నారు. ఎక్కడికి వెళ్ళిన జనం మాత్రం కిక్కిరిసిపోతున్నారు. అభిమానంతో వచ్చేవారు కనుమరుగవుతున్న పరిస్థితి, ఏ రాజకీయ పార్టీ పరిస్థితి చూసిన ఇదే తీరు.

జనం తమ వైపు ఉన్నారని చెప్పుకునేందుకు అభ్యర్థులు ఖర్చులకు వెనుకాడడం లేదు. తమవార్డు కాలనీలకు అభ్యర్థి వస్తున్నారంటే ఆ పార్టీకి చెందిన లీడర్లు ముందుగానే కార్యకర్తలను సమీ కరిస్తున్నారు. స్వచ్ఛందంగా వచ్చేవారు కొందరు మాత్రం ఉంటే.. రోజు వారి కూలి కింద వచ్చేవారు ఎక్కువ ఉండడం గమనార్హం. ఎవరు డబ్బు ఇస్తే వారివెంట ఉంటాం.. ఎవరు గెలిస్తే తమకేంటి అన్నట్లుగా చందంగా మారింది. ప్రస్తుత ఎలక్షన్ లో.. ఏ పూటకాపూట బీరు,బిర్యానీ, కరెన్సీ నోట్ ఉంటే చాలు అంటూ జెండా రంగులతో తేడా లేకుండా అన్నింటిని మోస్తున్నారు. ఇంత ఖర్చు పెడుతున్నా చివరికి గెలుస్తారో లేదో తెలియని అయోమయంలో అభ్యర్థులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇలా అన్ని పార్టీ జెండాలమోసి అన్ని కండువాలు కప్పుకొని, ఎవరు డబ్బులు ఇస్తే వారి వెంట తిరిగి చివరికి ఆయా పార్టీల నిల్చునే అభ్యర్థులకు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. ఏదేమైనాప్పటికీ ఓటరే వజ్రాయుధం కాబట్టి అభ్యర్థులను ఓటేస్తారో.. కాటేస్తారో.. వేచి చూడాల్సిందే మరి.

## పనిచేయని అక్కన్నపేట సబ్‌స్టేషన్

### ఫోన్ నెంబర్‌తో రైతులకు అవస్థలు

**అక్కన్నపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** అక్కన్నపేట మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అత్యవసర పరిస్థితుల్లో రైతులు సంప్రదించేందుకు ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్ గత మూడు నెలలుగా పని చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరెంట్‌సరఫరా ఉందా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు సబ స్టేషన్‌కు ఫోన్ చేయాలన్నా కాల్ కలవకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యను ఇప్పటికే పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సరైన స్పందన లేదని రైతులు వాపోతున్నారు. త్వరలో పరిష్కరిస్తాం అంటూ కాలం గడుపుతున్నారే తప్ప, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేయాల్సిన అవసరంఉన్నా నెంబర్ పనిచేయకపోవడంతో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు పేర్కొన్నారు. వెంటనే స్పందించి సబ్‌స్టేషన్ ఫోన్ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని, అలాగే రైతులకు సరైన సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను అక్కన్నపేట మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు.



అక్కన్నపేట సబ్‌స్టేషన్ దృశ్యం

**కోహెడ, నంగునూర్ మండలాలలో..**

## పెద్దపులి సంచారం

- -ఆవులు లేగ దూడలపై దాడి
- -ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్న అటవీశాఖ అధికారులు
- -పెద్దపులి కోసం గాలింపు చర్యలు ముమ్మరం

**కోహెడ/నంగునూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** జిల్లాలోని కోహెడ, నంగునూర్ మండలాలలోని వివిధ గ్రామాల్లో గత కొద్ది రోజులుగా పెద్దపులి సంచారిస్తూ పశువులపై పంజా విసురుతుంది. పులిదాడిలో మూగజీవాలు ప్రాణాలు కోల్పోతుండడంతో రైతులు ,ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోహెడ మండల పరిధిలోని అరెపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చంద్రనాయక్‌తండాలో తండాకు చెందిన రైతు మాలోతు రమేష్ మేత కోసం పశువులను శనివారం రాత్రి పచ్చికబయళ్లలో కట్టేసి వెళ్లి తెల్లవారుజామున వచ్చేసరికి ఒక ఆవు చనిపోయి కనిపించింది. కొద్ది ముందుకు వెళ్లి చూడగా చెట్ల పొదల నుంచి శబ్దం రావడంతో భయంతో వెనక్కి వచ్చి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులంతా కలిసి వెళ్లి చూడగా మూడు పశువులు చనిపోయాయి. ఈ విషయాన్ని పోలీసులకు,అటవీశాఖ అధికారులకు తెలియజేయడంతో ఘటనాస్థలం వద్దకు చేరుకొని అధికారులు పులిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

**నంగునూర్‌లో,...**

మండల పరిధిలోని ఘనపూర్ గ్రామ శివారులో పెద్దపులి సంచారం కలకలం రేపింది. గ్రామ శివారులో ఉన్న రెండు లేగా దూడలపై దాడి చేసింది. పెద్దపులి దాడిలో ఒక లేగ దూడకు గాయాలు కాగా మరొక లేగ దూడను చంపినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో రైతులు, గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురువుతున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొన పరిశీలించారు. అక్కడ పెద్దపులి పాద ముద్రలను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తున్న అవకాశముందని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని రాత్రి వేళల్లో పొలాల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేగ దూడలపై దాడికి పాల్పడిన పెద్దపులి మళ్లీ వచ్చే ప్రమాదం ఉందని అటవీశాఖ అధికారులు తెలిపారు. లేగ దూడలపై పెద్దపులి దాడి చేసిన సంఘటన చోట సిసి కెమెరాలుబిగించి నిఘాఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితి కనిపిస్తే వెంటనే అటవీ శాఖ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలన్నారు.



ఘనపూర్‌లో పెద్దపులి పాదముద్రాలను సేకరిస్తున్న దృశ్యం



చంద్రనాయక్ తండాలో పెద్దపులి దాడిలో మృతి చెందిన ఆవు

## దారుణం...పెంటకుప్పపై దొరికిన పసికందు

**..అక్కున్న చేర్చుకున్న తండావాసులు**

**చిలిపిచెడ్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** పుట్టిన పసికందును పెంటకుప్పపై వదిలిపెట్టి వెళ్లిన సంఘటన చిలిపిచేడ్ మండలంలో కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చిలిపిచేడ్ మండలంలోని బద్రియా తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పెంటకుప్పపై ఒక మగ బిడ్డను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. గుక్కపెట్టి ఆప కుండా ఏడుస్తున్న బిడ్డను స్థాని కులు గమనించి అంగన్వాడీ టీచర్ అనితకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న ఆమె ఆ మగ బిడ్డను అక్కున చేర్చుకొని పోలీసు లకు సమాచారం అందించింది. అక్కడికి చేరుకున్న పోలీసులు అంగన్వాడీ టీచర్ కలిసి హుటాహుటిన మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బిడ్డకు చికిత్స అందిస్తున్నట్లు అంగన్వాడీ టీచర్ అనిత తెలిపారు. ఆ బిడ్డ పుట్టి ఒకటి రెండు రోజులు కావచ్చు అని, బిడ్డ బరువు 3.0కి లోలు ఉందని,బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించారని అనిత పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డీఓ,మున్సిపల్ కమిషనర్ తదితరులు

## పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పరిశీలించిన కలెక్టర్

**నర్సాపూర్ ,ఫిబ్రవరి 8, ప్రభాత వార్త:** మున్సిపల్ ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన నర్సాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఎంతమంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతేగాక నర్సాపూర్‌లోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏర్పాట్లను, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఈ పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఆదివారం సాయంత్రం తో ముగుస్తుందని తెలిపారు. ఈ పోస్టల్ బ్యాలెట్ లను కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్యన కౌంటింగ్ హాల్ కు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాగా, ఎన్నికల విధుల్లో నియమించబడినపోలీసు సిబ్బంది చివరి రోజైన ఆదివారం పెద్ద సంఖ్యలో ఫెసిలిటేషన్ సెంటర్ కు తరలివచ్చి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వివరించారు. ఈ సమయంలో జిల్లా కలెక్టర్ వెంట నర్సాపూర్ ఆర్డిఓ మహిపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి. ఇతర శాఖల అధికారులు తదితరులున్నారు.



## హుస్నాబాద్‌లో .... ఒక్క ఛాన్స్ ఇవ్వండి

**చైర్మన్ పీఠాన్ని అప్పగిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా**

**మున్సిపల్‌లో కాంగ్రెస్, బిఆర్ఎస్‌లను గెలిపిస్తే కేంద్ర నిధులు దారిమళ్లిస్తారు**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్**

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క అవకాశమిచ్చి హుస్నాబాద్ మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని భారతీయ జనతా పార్టీకి అప్పగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం రోజున మున్సిపల్‌ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. హుస్నాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందంటే కేంద్ర నిధులతోనే అని, వీధిలో వెలిగే విద్యుత్ లైట్ మొదలు రోడ్లు, డ్రైనేజీ, నీళ్ల సరఫరా, పార్కుల ఏర్పాటు దాకా అన్నీ మోదీ ఇచ్చే నిధులతోనే జరుగుతున్నాయని, ఎల్కతుర్తి నుండి సిద్దిపేట వరకు జాతీయ రహదారి విస్తరణకు వందల కోట్లు తీసుకొచ్చానని, 14, 15వ ఆర్థిక సంఘాలతో పాటు స్వచ్ఛ భారత్ ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులిచ్చిందని, స్వనిధి ద్వారా 2431 మందికి 4కోట్ల 35 లక్షల రూపాయలు లబ్ది చేకూర్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులందరికీ ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లు ఇవ్వడంతో పాటు విద్యార్థులందరికీ పరీక్షఫీజు చెల్లించానని, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులకు మెడికల్ ఎక్విప్‌మెంట్స్ అందించి మెరుగైన చికిత్స అందించేందుకు తాను కృషి చేసానన్నారు. ఒకప్పుడు గ్రామపంచాయతీగా ఉన్న హుస్నాబాద్‌ను మున్సిపాలిటీగా మార్చిన తరువాత ఏమైనా అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను గెలిపిస్తే అభివృద్ధి చేయడం పక్కకు పెడితే వచ్చే కేంద్రం నిధులను దారిమళ్లిస్తారన్నారు. గడిచిన 12 సంవత్సరాలకాలంలో ఇప్పటికీ వర్షాకాలం వస్తే వరద నీటితో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్ ప్రాంతాలు జలమయమవుతున్నాయని, అడ్డగోలు ఇంటి పన్నులు పెంచడంతో వ్యాపార, వాణిజ్య వర్గాలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పట్టణంలోని ఆరెపల్లి ప్రజలు స్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నారని,హుస్నాబాద్ ఛైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే వరద ముప్పు లేకుండా అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్ ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని, ఇంటి పన్నును క్రమబద్దీకరించడంతో పాటు ఆరెపల్లికి స్మశాన వాటికను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. పట్టణాన్ని అమృత్ స్కీం పరిధిలోకి తీసుకొచ్చి, స్లమ్ ఏరియాలను అభివృద్ధి చేయడంతో పాటు బంజారా భవన్‌ను పూర్తి, సైనిక్ స్కూల్, ఏకలవ్య, నవోదయ స్కూళ్లను హుస్నాబాద్ లోనే ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని, పొట్లపల్లిలోని శ్రీ స్వయంభూ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వరకు 4 లేన్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తామ్మారు. ఈ బహిరంగ సభలో హుస్నాబాద్ ఎన్నికల ఇంఛార్జీ కూరపాటి విజయ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, నియోజకవర్గ నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## చెరుకు రైతుల నిరసన

**మనూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** ఆరుగాలం కష్టించి పండించిన చెరుకును తీసుకోవడంతో మాగి చక్కెర కర్మాగార యాజమాన్యం అవలంబిస్తున్న తీరుపై చెరుకురైతులు ఆదివారం మండలపరిధిలోని ఎన్‌జి హుక్రానాలో నిరసనకుదిగారు. ఈ సందర్భంగా చెరుకు రైతులు మాట్లాడుతూ చెరుకుపంటను పండించిన రైతులనుంచి మాగి కర్మాగార యాజమాన్యం అగ్రిమెంట్ కుదుర్చుకుందన్నారు. కోతదశకు వచ్చిన చెరుకును క్రష్టింగ్ చేసేందుకు కర్మాగార అధికారులు పర్మిట్లు ఇవ్వాల్సి ఉండగా ఇతర ప్రాంతాలైన కర్ణాటక, జహీరాబాద్ ప్రాంతాల్లోని చెరుకు రైతులకు అధిక ధర చెల్లిస్తూ చెరుకు క్రషింగ్‌కు పర్మిట్లు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు టన్ను చెరుకుకు 3700 ఇస్తామని చెప్పిన కర్మాగార యాజమాన్యం ఇతర ప్రాంతాల వారికి టన్నుకు 4200 రూపాయలు చెల్లించడమే కాకుండా పర్మిట్లు తమ ఇష్టారీతిగా అందిస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని మండి పడ్డారు. సకాలంలో చెరుకు క్రషింగ్‌కు పర్మిట్లు ఇవ్వని కారణంగా చెరుకు పంట పొలంలోనే ఎండుకుపోతోందని, ఫలితంగా తూకం తక్కువగా వచ్చి ఆర్థికంగా ఇబ్బందులు పడటమే కాకుండా మానసికంగా అవస్థలు పడుతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాగి చక్కెర కర్మాగార యాజమాన్యం స్పందించి తమకు న్యాయం చేయాలని చెరుకు రైతులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ మాధవిదేవి

## అంతర్లీనంగా ఉన్న సప్త శక్తులకు జాగృతం చేయడానికే సప్తశక్తి సంగం : జస్టిస్ మాధవిదేవి

**సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మహిళల్లో అంతర్లీనంగా ఉన్న సప్తశక్తులను జాగృతం చేయడానికి సప్తశక్తి సంగం ఎంతోగానో ఉపయోగ పడుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి చెప్పారు. శ్రీసరస్వతి విద్యాపీఠం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలను జాగృతం చేయడానికి సప్తశక్తి సంగమాలు రావడం ముదావహం అని తెలిపారు. నారాయణగూడలోని కేశవ మెమోరియల్‌పటేల్ హాల్‌లో శ్రీసరస్వతీ విద్యా పీఠం ఆధ్వర్యంలో సప్తశక్తి సంగం ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళల్లో శక్తులను జాగృతం చేయడం శ్రీసరస్వతీ శిశు మందిరాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రీయ సేవికాసమితి ప్రాంత కార్యవాహిక శ్రీపాద రాధ మాట్లాడుతూ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవ దర్శనాన్ని మహిళా శక్తికి అను సంధానిస్తూ మాట్లాడారు. విద్యాపీఠం రాష్ట్ర వ్యాప్తంగా సప్తశక్తి సంగ మాలు నిర్వహించి చరిత్ర సృష్టించారని కొనియాడారు. విదా ్యపీఠం ప్రాంత కార్యదర్శి అనఘా వెంకటలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2,345 సప్తశక్తి సంగమాలు జరిగాయని, 30 వేల మందికిపైగా ఈ కార్యక్రమానికి మహిళలు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య క్షేత్ర బాలికా ప్రముఖ్ ధరణిప్రియ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలి



రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అసోసియేషన్ నాయకులు

**సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** వెలమ కులాన్ని పదే పదే దూషి స్తున్న సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే బేషరుతుగా క్షమాపణలు చెప్పాలని ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ డిమాండ్ చేసింది. హిమాయత్‌నగర్‌లోని వెలమ అసోసియేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అసోసియే షన్ ఉపాధ్యక్షుడు తాండ్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ గత కొంతకాలంగా మాజీ సిఎం కెసిఆర్‌ను టార్గెట్ చేస్తూ వెలమ కులాన్ని రేవంత్‌రెడ్డి తిదు తున్నారని ఆరోపించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డి ఇలా ఒక కులంపైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కెసిఆర్ తమ జాతికి మాత్రమే జాతిపిత కాదని, 14 ఏళ్ల ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి రాష్ట్రానికి జాతిపితగా నిలిచారన్నారు. రేవంత్‌రెడ్డి క్షమాప ణలు చెప్పాలని, లేనిపక్షంలో న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## మానసిక, శారీరక దృఢత్వానికి కరాటే దోహదం: గట్ల

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మానసిక, శారీరక దృఢత్వానికి కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం సీని యర్ నాయకుడు గట్ల రవీంద్ర(హైటెక్ రాము) పేర్కొన్నారు. న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 5వ అంతర్జాతీయ ఓపెన్ టూ ఆల్ స్టైల్స్ కరాటే కుంగ్‌ఫూ ఛాంపియన్ షిప్ 2026 పోటీలలో ముఖ్యఅతిథి గట్ల రవీంద్రను ఎన్‌డిఎఫ్‌ఎంఏ వ్యవస్థాపక అధ్యక్షుడు, టోర్నమెంట్ నిర్వాహకులు పెద్దపూర శ్రీరాములు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రోత్సహిస్తూ శిక్షణ ఇప్పించాలని, తద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉంటారన్నారు. ఈ పోటీలల్లో బాలికలు కూడా ఉత్సాహంగా పాల్గొనడం పట్ల అభినందించారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అమ్మాయిలకు చదువుతో పాటు వారి ఆత్మ రక్షణ కోసం ఈ విద్యలు కూడా చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దపూర సైదులు, కనుముల సాయికృష్ణ, బండపల్లి కృష్ణరావు, మడిశెట్టి వినోద్, లక్ష్మణ్(నాని), చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ



నూతన సంవత్సర డైరీని ఆవిష్కరిస్తున్న వరుణ్‌రెడ్డి, తదితరులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8(ప్రభాతవార్త) :** తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీ ఆవి ష్కరణ కార్యక్రమం అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్.కె.మాజీద్ ఆధ్వ ర్యంలో ఆదివారం జరిగింది. సంస్థ ప్రధాన కార్యాలయంలో ఉత్తర తెలం గాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ వరుణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్.కె.మాజీద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.పర్వతాలు, నాయకులు ఈసాక్, కెయాదయ్య, జలీల్, లింగయ్య పాల్గొన్నారు. డైరీ ఆవిష్కరణ అనంతరం, కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న పలుసమస్యలను సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా (స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్) ధరల సవరణ గురించి పెండింగ్‌లో ఉన్న ఇతర సాంకేతిక అంశాల గురించి ఆయనకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సిఎండి వరుణ్‌రెడ్డి అసోసి యేషన్ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేద్దామని, ఆ చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు వివిధ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో విద్యుత్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## పాతబస్తీలో వైభవంగా నగర సంకీర్తన ఊరేగింపు

**చార్మినార్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** హైదరాబాద్ హరేక్రిష్ణ నామ్ సంకీర్తన సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పాతబస్తీలో వైభవంగా నగర సంకీర్తన ఊరేగింపు జరిగింది. వందలాదిమంది బెంగాలీలు ఈ ఊరేగింపు లో పాల్గొన్నారు. కాగా ఆదివారం ఉదయం కుడా స్టేడియం నుంచి ప్రారం భమైన సర్బోజనిన్ హరేక్రిష్ణ నామ్ సంకీర్తన ఊరేగింపు ఘాన్సీ బజార్, కోకరివాడి, ఝూలా, కోకరివాడి, షక్కర్‌కోట, ఆనందగల్లీ, కాలీకమాన్, చార్మినార్, గుల్జార్‌హౌస్, మామాజుమ్లా పాఠక్‌తో పాటు పలు ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం కుడా స్టేడియంకు చేరుకుంది. ఈ కార్య క్రమంలో హైదరాబాద్ హరేక్రిష్ణ నామ్ సంకీర్తన సొసైటీ ప్రతి నిధులు నిమై మలిక్, శంకర్‌ఘోష్, హేమంత్ మలిక్ పాటు పలువురు పాల్గొన్నారు. కాగా చార్మినార్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఊరేగింపులో పాల్గొన్న హరేక్రిష్ణనామ్ సంకీర్తన సొసైటీ ప్రతినిధులు

# ప్రభుత్వ భూముల్లో హాస్టల్స్ నిర్మించాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



విద్యార్థులకు అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, నీల వెంకటేష్, అనంతయ్య, రాజేందర్, అంజీ

**సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభు త్వం భూములను వేలం వేయరాదని, ఆ భూము ల్లో లక్షలాది మంది విద్యార్థుల కోసం హాస్టల్స్, గురుకులాలకు సొంతభవనాలను నిర్మించాలని రాజ్య సభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అలాగే 150 బిసి కాలేజీ హాస్టల్స్ మంజూరు చేయాలని, హాస్టల్స్‌కు 8 నెలలుగా చెల్లించాల్సిన మెస్ బిల్లుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విద్యా ర్థుల కోర్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ స్థలా లన్ని ప్రజల ఆస్తులని వీటిని ప్రజావసరాలకు, పేదలు ఇళ్లు కట్టుకోవడానికి, ప్రభుత్వ కార్యాలయా లకు, హాస్టళ్లు, స్కూల్ నిర్మాణాలకు మాత్రమే విని యోగించాలని, అమ్మడానికి కాదని, అమ్మితే భవిష్యత్ తరాలకు ఏమి మిగలదన్నారు. భూములను పేద లకు పంపిణీ చేయాలని, హాస్టళ్ళ, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించిన తరువాతే అమ్మకాలకు పోవాలన్నారు. ప్రభుత్వం కనీసం హాస్టల్స్, గురు కులాల నిర్మాణాలకు స్థలాలైన కేటాయిస్తే ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ప్రభుత్వం, ఎంపిల నిధుల ద్వారా భవనాలను నిర్మించుకోవచ్చునని ఆయన సూచించారు. బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 325 హాస్టల్స్, 320 గురుకులాలు ఉన్నాయని, ఒక్క దానికి కూడా సొంత భవనం లేదని, దీంతో 5 గురు విద్యార్థులు ఉండాల్సిన గదిలో 30 మంది నివసిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

హాస్టల్స్‌కు బకాయిల బిల్లులు చెల్లించకపోతే నిత్యావసర వస్తువుల సరఫరా నిలిపివేసే ప్రమాదం ఉందని, అద్దె భవనాలకు మూడేళ్లుగా అద్దె చెల్లించక పోవడంతో యాజమానులు ఖాళీ చేయమని డిమాండ్ చేస్తున్నారని, దీంతో విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి ఉన్నందున తక్షణమే అద్దెలు చెల్లించాలని, విద్యార్థులకు బస్‌పాస్, చిల్లర ఖర్చు లకు ప్రతి ఒక్కరికి నెలకు అమ్మాయి లకు రూ. 1000, అబ్బాయిలకు రూ. 800 మం జూరు చేయాలని, ప్రతి హాస్టల్‌కు మరో ఇద్దరు వర్కర్లను నియమించాలని, ఇంజనీరింగ్, ఎంబిఎ, ఎంసిఎ, ఫార్మసీ, పిజీ, డిగ్రీ, ఇంటర్ కోర్సులు చదివే విద్యార్థులకు మొత్తం ఫీజులను ప్రభుత్వమే చెల్లిం చాలని, ఫీజుల బకాయిలు 800 కోట్లు తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నేతలు నీల వెంకటేష్, అనంతయ్య, సి.రాజేందర్, జిల్లపల్లి అంజీ, నిఖిల్, చిక్కుడు బాలయ్యముదిరాజ్, మహేష్‌యాదవ్, శివకుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రమణాచారి దంపతులను సత్కరిస్తున్న మురళీమోహన్, నరసింహారెడ్డి

## కనుల పండువగా కె.వి.రమణ అమృతోత్సవం

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రతిభను ఫరిడవిల్లింపు జేస్తున్న కళాకారులే దేశానికి ఎన్నటికీ తరగని సాంస్కృ తిక సంపద అని లోక్‌సభ మాజీ సభ్యుడు, సుప్రసిద్ధ సినీనటుడు, నిర్మాత, వ్యాపారవేత్త మాగంటి మురళీమోహన్ అన్నారు. అంతటి కళాకారులు నిత్య ప్రాతఃస్మరణీయుడుగా ఆరాధిస్తున్న సాంస్కృతిక సౌజన్య ప్రధాత, అజాత శత్రువు, కళాసంస్థలు, కళాకారులను ఆదరించి అక్కున చేర్చుకునే గొప్ప ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణ అన్నారు. సాం స్కృతికబంధు సారిపల్లి కొండలరావు సౌజన్యంతో సత్కళాభారతి, యువకళావాహిని, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం సంయుక్త నిర్వహణలో ఆదివారం ఉదయం రవీంద్రభారతి ప్రధానం మందిరంలో సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరి గిన జరిగిన కె.వి.రమణ అమృతోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మురళీమోహన్ విశిష్ట అతిథులు తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాల కుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ సాహితీ వేత్త డా. ఓలేటి పార్వతీశం, ప్రముఖ కళాపోషకుడు డా. బూరుగుపల్లి వ్యాసకృష్ణ, నిర్వహణా సంస్థల అధిపతులు జి.సత్యనారాయణ, లంక లక్ష్మీనారా యణ, వంగా శ్రీనివాస్‌గౌడ్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి 75వ అమృతోత్సవంను ప్రారంభించి డా. కె.వి.రమణ, పుష్పలత దంపతు లను ఘనంగా సత్కరించి ప్రసంగించారు. రమణా చారి నేతృత్వంలోని కళాకారుల సంక్షేమార్థం రూ. 5 లక్షల విరాళాన్ని మురళీమోహన్ ప్రకటించారు. అనంతరం కళాపోషకుడు వ్యాసకృష్ణ రూ. లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఏనుగు నరసింహా రెడ్డి మాట్లాడుతూ చెదిరిపోయిన కళలను ఒడిసి పట్టు కుంటారు కళాహృదయుడు రమణాచారి అన్నారు.

## ప్రభుత్వ రాయితీలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలి

**సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న పరి శ్రమలకు అందిస్తున్న రాయితీలను పారి శ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకో వాలని సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) మహిళా సాధి కారత జాతీయ అధ్యక్షురాలు డా.వి.వి.శ్రీలక్ష్మీవాణి పిలుపునిచ్చారు. మైద్ స్వర్ణకార్ సమాజ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కొత్త పరిశ్రమలు స్వయం ఉపాధికి సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఎంఎస్ఎంఈ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఎంఎస్ఎంఈ తెలం గాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్రకుమార్ కడేల్ అధ్యక్షత వహించారు. శ్రీలక్ష్మీవాణి మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటు వల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏర్పడి దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు వివిధ రంగాల్లో రాణిస్తే దేశ జిడిపిలో 30 శాతం సహకరిస్తూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కల్పిస్తూ, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయన్నారు. ఈ సదస్సులో స్వర్ణకార్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌కుమార్ సుగంద్, నిర్వహ కులు రవికుమార్ అసాద్, శాంతికుమార్, నరే ంద్రకుమార్, విష్ణుకుమార్ జంగా తదితరులు పాల్గొన్నారు.




సదస్సులో ప్రసంగిస్తున్న శ్రీలక్ష్మీవాణి



రన్నరప్ యశస్విని సత్కరిస్తున్న దృశ్యం

### మిస్ గ్రాండ్ తెలంగాణ 2026

## రన్నర్ అప్ యశస్వినికి ఘన సన్మానం

**మూసాపేట్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** మిస్ గ్రాండ్ తెలంగాణ 2026 అండర్-19 పోటీలలో రెండవ రన్నరప్‌గా నిలిచిన యశస్వినిని కూకట్‌పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న, ఇష్టకామేశ్వరి కోలాటం టీం ఘనంగా సన్మానించారు. ఆదివారం మూసాపేట భరత్‌నగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో ఇష్టకామేశ్వరి కోలాటం టీం ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ సన్మాన కార్యక్రమానికి కూకట్‌పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యశస్వినిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఎర్ర యాకన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం తరపున రాబోయే రోజుల్లో మిస్ ఇండియా వంటి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని రాష్ట్ర ఖ్యాతిని దేశవ్యాప్తంగా పెంపొందించాలని ఆకాంక్షిం చారు. యువత ఇలాంటి విజయాలతో ముందుకు రావడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో శివలక్ష్మి, మీనా కుమారి, శ్రీదేవి, జయలక్ష్మి, సుజాత వరుడు, శైలజ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన రోడ్డు స్థలాన్ని పరిశీలించిన మర్రి

**బేగంపేట ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** బేగంపేట ప్రకాశం నగర్ పరిధిలోని లిటిల్ బేగంపేట లో ఒక రోడ్డు స్థలాన్ని కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమంగా ఆక్రమించుకున్నారని, వారిపై తాము అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని, తమకు న్యాయం చేయాలంటూ లిటిల్ బేగంపేట కాలనీ వాసులు బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్, మాజీ ఎన్‌డీఎంఏ ఉపాధ్యక్షులు మర్రి శశిధరరెడ్డికి విజ్ఞప్తి చేసారు. వారి విజ్ఞప్తి మేరకు మర్రి శశిధరరెడ్డి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్ తో కల్సి ఆదివారం కాలనీలో ఆక్రమణకుగురైన రోడ్డు స్థలాన్ని పరిశీలించారు. ఈ కాలనీకి ఉత్తరం వైపు రోడ్డును కొందరు నకిలీ పత్రాలు సృష్టించి చుట్టూ గోడ నిర్మించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కాలనీ వాసులు మర్రి దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన మర్రి వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారు లకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. స్పందించిన అధికారులు అక్రమ ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసారన్నారు. దీంతో పాటు తమ పక్కనే ఉన్న బస్తీలో నుంచి మురికి నీరు తమ అపార్ట్‌మెంట్ల ముందు రోడ్లపై పారు తుండటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందన్నారు. దోమలు దాడి అధికంగా ఉంటుందని, ఈ సమస్య తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని, పరిష్కారానికి కృషి చేయాలని మర్రిని కోరారు. స్పందించిన మర్రి వెంటనే సమస్య పరిష్కరించాలంటూ వాటర్‌వర్క్స్ శాఖ అధికారులకు లిఖిత పూర్వకం గా ఫిర్యాదు చేస్తానని, జీహెచ్ఎంసీ అధికారులతో కూడా చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీనివాసులు, సుమన్, కృష్ణమోహన్, మధుసూదన్, తురగా లక్ష్మి, లక్ష్మణ్, రాఘవేంద్ర, రాజన్, సూర్య, డాక్టర్ కవిత, బీజేపీ నాయకులు సీ.విజయ్‌కుమార్, తారకం పేట శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



కబ్జాకు గురైన రోడ్డు స్థలాన్ని పరిశీలించి కాలనీవాసులతో చర్చిస్తున్న మర్రి

# మున్సిపల్ ఎన్నికల్లో బిసి అభ్యర్థులకే పట్టం కట్టాలి

### బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ తదితరులు

**సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** ఈ నెల 11వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా జనరల్ స్థానాల్లో ఎన్నికల బరి లో నిలబడ్డ బిసిలను గెలిపించాలని బిజి జెఎసి నిర్ణయించిందని బిసి జెఎసిచైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆదివారం బిసి జెఎసి కార్యాలయం లో జరిగిన జెఎసి విస్తృతస్థాయి సమావేశంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్ల లో జరుగుతున్న ఎన్నికల్లో ఓటు మనదే, సీటు మనదే అనే నినాదంతో బిసి ప్రజలు బిసిలకే ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి బిసిల రాజకీయ ఐక్యతను, సామాజిక చైతన్యాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు అమలు జరుగు తుండగా 10 శాతం ఉన్న అగ్రకులాలు 50 శాతం జనరల్ స్థానాల్లో పోటీచేస్తున్నారని, జనరల్ స్థానాలు అంటే రెడ్డి, రావులవేకావని ఆయన స్పష్టం చేశారు. 60 శాతం ఉన్న బిసిలకు 28 శాతం మాత్రమే కల్పించాలని, రిజర్వేషన్‌లు లేనిచోట జనరల్ స్థానాల్లో నిలబడిన బిసిలను గెలిపించడం ద్వారా బిసిలకు న్యాయం జరుగుతుందని ఆయన వివరిం చారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నిక ల్లోవలే ఈ మున్సిపల్ ఎన్నికల్లోనూ బిసిలు ఓటు అనే ఆయుధంతో అగ్రకులాలను ఓడించి తెలంగాణ లో బిసి రాజ్యాధికారానికి పునాది వేయాలని ఆయన కోరారు. ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీకి సిద్ధాంతాలు లేవని ఒకవేళ సిద్ధాంతాలు ఉంటే నైతిక విలువలతో ఏ పార్టీకి, ఆ పార్టీ ఇతరులతో పొత్తు లేకుండా ఎన్నికల్లో పోటీచేసేవని, కాని విచిత్రంగా బద్ధ విరో ధులమని చెప్పుకుంటున్న పార్టీలు అపవిత్ర అక్రమ పొత్తులతో గెలవాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఈ సమావేశం జెఎసి రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్, బిసి విద్యార్థి జెఎసి చైర్మన్ బొల్లెపల్లి స్వామి సమన్వంతో జరిగింది. బిసి నేతు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, తాటికొండ విక్రమ్‌గౌడ్, మాదేశి రాజేందర్ పాల్గొన్నారు.




డైరీని ఆవిష్కరిస్తున్న హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

## గంగపుత్రులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

### హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8(ప్రభాతవార్త) :** గంగపుత్రులు రాజకీయ, సామా జిక, ఆర్థిక రంగాలలో రాణించి ముందుకు సాగాలని హర్యాన పూర్వ గవ ర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం డైరీ ఆవిష్కరణసభ సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి అధ్యక్షతన జరిగింది. డైరీని ఆవిష్కరించిన అనంతరం బండారు దత్తా త్రేయ మాట్లాడుతూ డెబ్బై సంవత్సరాలపాటు గంగపుత్ర సంఘం ముందుకు నడుస్తూ సమాజాభివృద్ధికి, సంఘం అభివృద్ధికి సహరించిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గంగపుత్ర సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గంగపుత్రులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. సభలో సంఘం ప్రధాన కార్యదర్శులు చంద్రప్రకాష్, ఓం ప్రకాష్, ఉపాధ్యక్షుడు గుడబోయిన శివరత్నం, కంటే రామచందర్, ఎర్రబోయిన మల్లేష్, ప్రొఫెసర్ భాగయ్య, అదనపు డీసీపీ నర్సయ్య, నగర సంఘం అధ్యక్షుడు చాట్ల సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎంఎస్ అఖిల భారత అధ్యక్షుడిగా సుంకరి మల్లేశం



మల్లేశంను సత్కరిస్తున్న కృష్ణ తదితరులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త) :** భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత అధ్యక్షుడిగా తెలంగాణ ప్రాంతానికి చెందిన సుంకరి మల్లేశం ఎన్నికైనారు. భారతీయ త్రైవార్షిక మహాసభలు పూరి పట్టణంలో భువనేశ్వర్ ఒరిస్సాలో జారుతున్న విషయం తెలిసిందే. ఆదివారం భారత దేశంలోని అన్నీ రాష్ట్రాల నుండి ప్రతినిధులతోపాటు ఇటలీ, రష్యా, చైనా, మారిషస్, అబుదాబి, జపాన్ తదితర పన్నెండు దేశాల జాతీయ స్థాయి యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశాల్లో భాగంగా ఆదివారం కేంద్ర కార్య సమితిని ఎన్నుకున్నారు. అఖిల భారతీయ అధ్యక్షుడిగా సుంకర మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికైనారు. మల్లేశం తెలంగాణప్రదేశ్ నుండి 40 సంవత్సరా లుగా బిఎంఎస్‌లో వివిధస్థాయిలో పనిచేస్తూ ప్రస్తుత కేంద్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తూనే కేంద్ర కార్మిక శాఖ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సభ్యులుగా కొన సాగుతున్నారు. కార్మిక లోకానికి వారు చేస్తున్నటువంటి సేవలకు దక్కిన గౌరవంగా సుంకర మల్లేశం ని కేంద్ర అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బిఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, భాగ్యనగర్ మున్సిపల్ జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ (బిఎంఎస్ అనుబంధం ) ప్రధాన కార్యదర్శి టి. కృష్ణ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లేశం ను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ బిఎంఎస్ జాతీయ అధ్యక్షుడిగా మల్లేశం కార్మికుల సంక్షేమం పట్ల అంకితభావం, నాయకత్వం నిబద్ధత నిజంగా అభినందనీయం అని అన్నారు. దూరదృష్టితో కూడిన మార్గదర్శకత్వంలో, బిఎంఎస్‌మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎం.రాధాకృష్ణ, కోశాధికారి ఆర్.వెంకటేష్, అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్. ప్రదుమన్ పాల్గొన్నారు.

## మ్యూజిక్ చైర్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులను అందిస్తున్న పావని వినయ్‌కుమార్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త) :** ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవంలో భాగంగా గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి లోని పీపుల్స్ పార్క్ , గాంధీనగర్ కెనరా బ్యాంక్ గ్రౌండ్లో జరిగిన సెమీఫైనల్లో మహిళా మ్యూజిక్ చైర్ విజేతలకు బహుమతులను ప్రదానోత్సవ సభ ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ హాజరై బహుమతులు అందించారు. పోటీల్లో పాల్గొన్న రెండు టీమ్ లలో చిక్కడపల్లి నుండి సమన్విత మొదటి బహుమతి, భాను రెండవ బహుమతి అందుకోగా, గాంధీనగర్ నుండి పూర్ణ దేవి మొదటి బహుమతి, పద్మప్రియ రెండవ బహుమతి దక్కించుకున్నారు. కార్పొరేటర్ గారి చేతులమీదుగా విజేతలకు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న అందరికీ పార్టిసిపే షన్ బహుమతులను అందచేసారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్‌కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, ఇన్చార్జి బద్రినారాయణ, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, నేతలు రత్నసాయిచంద్, శ్రీకాంత్, వివిస్‌టి రాజు, దామోదర్, పాల శ్రీనివాస్, పీ.నర్సింగ్‌రావు, సురేష్ రాజు, సత్యేందర్, సాయి గౌడ్, మంగమ్మ, సంయుక్త రాణి, పూర్ణ, అనుష పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** ఉచిత వైద్యశిబిరాలను అర్హు లైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరిరక్షణకు ప్రధాన్యత ఇవ్వాలని భారతీయ జనతాయువమోర్చ అధ్యక్షులు కోడి ఆదిత్యాముదరాజ్ సూచించారు. ఆదివారం చింతల్ రామ్‌కి అపార్ట్‌మెంట్స్‌లో శ్రీస్వప్న హస్పి టల్స్ డాక్టర్.మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పాల్గొన్నారు. ప్రస్తుత తరుణంలో ప్రతిఒక్కరూ ఆరోగ్య రక్షణపట్ల ప్రత్యేక శ్రద్ధచూపాలని సూచించారు. డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీస్వప్న హాస్పిటల్స్ కొంతకాలంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ వైద్య సలహాలు, సూచనలను నిర్వహిస్తుందన్నారు. ఈసందర్భంగా భారతీయ జనతా యువమోర్చ నాయకులు రామచంద్రం, సురేశ్, నరేశ్ పాల్గొన్నారు.

## సూరారం కట్ట మైసమ్మను దర్శించుకున్న శ్రీశైలంగౌడ్

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని సూరారం కట్ట మైసమ్మ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కట్ట మైసమ్మ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు స్థానిక డివిజన్ కాంగ్రెస్ నాయకులు భక్తులు పాల్గొన్నారు.



కూన శ్రీశైలం గౌడ్‌ను సత్కరించిన కమిటీ సభ్యులు

## వాసవిక్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ : గంప శ్రీనివాస్

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి యేటా సుమారు రూ.60 కోట్లతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గంప శ్రీనివాస్ అన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని గోపులాపురం యూపిఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం గంప వెంకట్ రాజం జ్ఞాపకార్థం మైక్ సెట్‌ను అందజేసి మాట్లాడారు. వాసవిక్లబ్ పేదల కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తండ్రి గంప వెంకట్ రాజం జ్ఞాపకార్థం పాఠశాలకు మైక్ సెట్‌ను అందజేయడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ సిద్దిపేట అధ్యక్షులు కూర శ్రీనివాస్,క్లబ్ ఐపిసి గంప కృష్ణమూర్తి, ప్రతినిధులు నాగమల్లి కిషన్, బుక్క అరుణ్,నాగమల్లు సంధ్య, బొక్క శివ, సంతోష్,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


యుపిఎస్ పాఠశాలకు మైక్ సెట్‌ను అందిస్తున్న దృశ్యం

## ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐ సౌజన్య

**బెజ్జంకి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** కోహెడ మండలంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని మండల పరిధిలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సౌజన్య తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే రైతులు ఇతర అవసరాలకు వెళ్లే వారు ఒంటరిగా వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మూగజీవను ఇంటి పరిసర ప్రాంతాల్లో భద్రపర్చుకోవాలన్నారు. రాత్రి వేళల్లో వ్యవసాయ బావులకు వద్దకు వెళ్లే రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## హైదారాబాద్ కరాటే లీగ్-2026లో...
## మెడల్స్ సాధించిన దుద్దెడ గ్రామస్తులు

**కొండపాక, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** ఒకినావ బినర్యు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదారాబాద్ కరాటే లీగ్-2026లో కొండపాక మండల పరిధిలోని దుద్దెడ గ్రామానికి చెందిన వడ్లకొండ ఆర్యన్ జూనియర్ కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్, కుమితే(స్పేరింగ్) విభాగంలో గోల్డ్‌మెడల్, గున్నాల రిషివర్ధన్‌గౌడ్ స్పేరింగ్ కటాస్ విభాగాలలో సిల్వర్ మెడల్ గెలుచుకున్నట్లు దుద్దెడ కరాటే సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ తిరుపతి,నర్సింలు తెలిపారు.



## ఇరుముడులతో శివదర్శనానికి బయల్దేరిన శివస్వాములు

**చౌటకూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరు నుంచి శివస్వాముఉలు ఆదివారం ఇరుముడులు కట్టుకుని జ్యోతిర్లింగాల దర్శనానికి బయలెళ్లారు. నిష్టనియమలతో దీక్షలు చేపట్టి శ్రీశైలంతో పాటు 10 జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు శివస్వాములు శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరర ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా గ్రామస్థులు శివస్వాములను ఘనంగా వీడ్కోలు పలికారు. మహాశివరాత్రి పర్వదినాన శ్రీశైలంలో కొలువున్న భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుంటామని శివస్వాములు గురుస్వామి రాజుగౌడ్, జగన్నాతం, శ్రీనివాస్ ముదిరాజ్, రమేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, సతీస్‌కుమార్ ముదిరాజ్, ఆగమయ్య, నరేందరరలు పేర్కొన్నారు.



## శ్రీశైలంకు చేరుకున్న శివస్వాముల పాదయాత్ర

**మనూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన శివస్వాములు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంలో కొలువున్న భ్రమరాంబ సేమతంగా కొలువున్న మల్లికార్జున స్వామి ఆలయానికి పాదయాత్ర ద్వార శివనామస్మరణ చేస్తూ ఆదివారం చేరుకున్నారు. మండల కేంద్రం నుంచి శ్రీశైలంకు 20వ పాదయాత్రగా మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండల పరిధిలోని బాదల్‌గావ్, దోసపల్లి, బోరంచ, నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన శివస్వాములు 20వ మారు పాదయాత్రగా బయలు దేరిన విషయం పాఠకులకు విధితమే. 9 రోజుల పాటు శివస్వాములు శివనామస్మరణ చేస్తూ శ్రీశైలంకు చేరుకున్నామని గురుస్వాములు వెంకటరామిరెడ్డి, డాక్టర్ అమృత్‌లు తెలిపారు.

## నేడు జహీరాబాద్‌కు సినీ నటి నవనీత్ కౌర రాక

**జహీరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు ఈ నెల 9న జహీరాబాద్ పట్టణానికి సినీ నటి, మహారాష్ట్ర అమరావతి బిజెపి మాజీ ఎంపి నవనీత్‌కౌర్ రానున్నట్లు బిజెపి జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రభారి డాక్టర్ పైడి ఎల్లారెడ్డి తెలిపారు. ఆదివారం బిజెపి ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డితో కలిసి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎల్లా రెడ్డి మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు అల్లీపూర్ పట్రోల్ పంపు నుంచి ఆర్యనగర్ శివాజీ విగ్రహం వరకు మోటల్ సైకిల్ ర్యాలీ నిర్వహించి బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుని సభను విజయవంతం చేయాలని సూచించారు.


బిజెపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ఇంచార్జి డాక్టర్ పైడి ఎల్లారెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి


రంజోల్ 6వ వార్డులో ప్రచారం చేస్తున్న టిమిరీస్ వైస్ చైర్మన్ ఎండి ఫహీం, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్

## ఎన్నికల ప్రచారం చేసిన
## టిమిరీస్ వైస్ చైర్మన్ ఎండి ఫహీం

జహీరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారరంలో టిఎంఆర్ఈఐఎస్ వైస్ చైర్మన్, ప్రెసిడెంట్ ఎండి ఫహీం ఖురుషి, మాజీ మంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్, రాష్ట్ర సెట్విన్ చైర్మన్ నందారం గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత డాక్టర్ ఉజ్వల్‌రెడ్డిలు పాల్గొని ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ అభ్యర్థి జానాబాయి ఇంటి నుంచి జాతీయ రహదారి మీదుగా చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి పట్టణ అభివృద్ధి సహకరించాలని సూచించారు. ప్రచారంలో మాజీ ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ చైర్మన్ సునీత హనుమంతరావు పాటిల్, ఝరాసంగం మండల కాంగ్రెష్ పార్టీ అధ్యక్షులు హన్మంత్‌రావుపాటిల్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నరేష్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**గజ్వేల్/గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆదివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని ఎడ్యుకేషన్ హబ్‌లో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ మరియు రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల నియమావళి ప్రకారం 10వ తేదీన పోలింగ్ మెటీరియల్ పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోలింగ్, పోలీస్ సిబ్బందికి మధ్యాహ్న భోజనం అందించడంలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఏర్పాటుచేసే 71 పోలింగ్ కేంద్రాలలో ఫర్నీచర్, ట్యూబ్‌లైట్లు, ర్యాంపు మరుగుదొడ్లు, త్రాగునీరు సౌకర్యాలు ఉండాలని, 11వ తేదీన పోలింగ్ రోజు సిబ్బందికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, మధ్యలో టీ అందించాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లు


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

ఎడ్యుకేషన్ హబ్‌లో రిసెప్షన్ సెంటర్‌కు తీసుకువచ్చి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలని అన్నారు. హబ్‌లో స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ సెంటర్ మొదటి అంతస్తులో కావున ఏర్పాట్లు అత్యంత పకడ్బందీగా చేయాలని పోలింగ్ సిబ్బంది, ఏజెంట్లకు పరిమితంగా పాస్ అందజేసిన వారిని మాత్రమే లోనికి అనుమతించాలని, వేరువేరుగా కౌంటింగ్ సెంటర్‌లోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, డిఆర్‌డివో జయదేవ్‌ఆర్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

**మున్సిపాలిటీలో మద్యం దుకాణాల బంద్**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో జరగబోయే ఎన్నికల సందర్భంగా 9వ తేదీ సోమవారం సాయంత్రం నుండి 11వ తేదీ బుధవారం పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు, 13వ తేదీ ఓట్ల లెక్కింపు రోజు ఉదయం 8 గంటల నుండి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు డ్రైడేగా ప్రకటించడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో గల మద్యం దుకాణాలు, ఏ4 రిటైల్ షాప్స్, 2బి బార్స్, కల్లు దుకాణాలు అన్ని మూసివేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తీవ్రమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## హస్తానికి ఓటు-అభివృద్ధికి మలుపు



-ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు హస్తం గుర్తుతో పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులకు ఓటుతో మద్దతు పలికి పట్టణంలో అభివృద్ధికి మలుపు తీసుకువాలని మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 14వ వార్డు నుంచి పోటీ చేస్తున్న గౌని రాజ్‌కుమార్‌కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచర సభలో చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి మున్సిపల్ అభివృద్దికి సహకరించాలని ప్రజలకు సూచించారు. అంతకు ముందు ఘడిలోని చర్చిలో మాజీ మంత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు మక్సూద్ ఆహ్మద్, నాయకులు ముజాహిద్ సేట్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌ను నిలదీయండి..

అవకాశవాదులను నమ్మకండి

క్ష హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** వచ్చే మున్సిపల్ ఎన్నికలలో అవకాశవాదులను నమ్మి ప్రజలు మోసపోవద్దని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం రోజున పట్టణంలోని 15వ వార్డుతో పాటు పలు వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గత మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక నాయకుడు తమ వద్దకు వచ్చి పార్టీలో చేరతా మంటే వారికి మున్సిపల్ చైర్మెన్ పీఠాన్ని కట్టబెట్టామని, ఐదేళ్ల పదవిని అనుభవించిన వారు ప్రభుత్వం మారడంతో తిరిగి అదే పార్టీలోకి వెళ్లి తల్లి పాలు తగా రొమ్మును గుద్దినంత పనిచేశారన్నారు. మున్సిపల్ చైర్మెన్‌గా అవకాశం ఇస్తే కనీసం వార్డును అభివృద్ది చేయలేకపోయారని విమర్శించారు. పార్టీ మారిన నాయకులు చైర్మెన్ పదవి అనుభవించి తిరిగి కౌన్సిలర్‌గా ఎన్నికల్లో పోటీ చేయడం వెనుక ఆంతర్యమేంటో అర్థం కావడం లేదని వాపోయారు. ఎన్నికలకు ఓట్లు అడిగేందుకు వచ్చే వారిని ప్రజలు ఆరు గ్యారంటీల అమలుతో పాటు ఇచ్చిన హామీలపై నిలదీయాలని పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్


బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే హరీష్ రావు

## గుమ్మడిదల గడ్డపై హరీష్ రావు హోరెత్తిన పోరు

- కాంగ్రెస్ మోసాలపై విరుచుకుపడి, బిఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరించిన

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**గుమ్మడిదల, ఫిబ్రవరి8, (ప్రభాతవార్త):** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు నిర్వహించిన విస్తృత ఎన్నికల ప్రచారం ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని రగిల్చింది. అన్నారం వార్డు నుంచి మున్సిపల్ కేంద్రం గుమ్మడిదల వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ – రోడ్ షోలో వేలాది మంది పాల్గొని బీఆర్ఎస్ పక్షాన నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. ప్రజల అపూర్వ స్పందనతో గుమ్మడిదల వీధులు జనసంద్రంగా మారాయి.రోడ్ షో అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో హరీష్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టడమే లక్ష ్యంగా అధికారంలోకి వచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఎక్కడ అమలయ్యాయో చెప్పాలని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల పట్ల బాధ్యతను మరిచి, పాలనను రాజకీయ ప్రతీకారాలకు పరిమితం చేసిన కాంగ్రెస్ నాయకత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందన్నారు..బీఆర్ఎస్ హయాంలో గుమ్మడిదల మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలో నిరంతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మౌలిక సదుపాయాల కల్పనలో గణనీయమైన మార్పులు తీసుకొచ్చామని హరీష్ రావు గుర్తు చేశారు. పల్లె నుంచి పట్టణం వరకు రోడ్లు,మాటలకే పరిమితం కాని – చేతలతో సాధించిన అభివృద్ధి తమ ప్రత్యేకత అని పేర్కొన్నారు.డంపింగ్ యార్డ్ అంశంపై తీవ్రంగా స్పందించిన హరీష్ రావు, నల్లవల్లి – సూరారం ప్రాంతాల్లో డంపింగ్ యార్డ్ నిర్మాణం ప్రజల జీవితాలను నాశనం చేసే కుట్రగా అభివర్ణించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ భద్రతను లెక్కచేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్ బారిన పడకుండా కాపాడుకోవాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాల్సిందేనని ప్రజలను అప్రమత్తం చేశారు.గుమ్మడిదల ప్రజల ఆత్మగౌరవం, అభివృద్ధి ఆశయాలకు బీఆర్ఎస్ మాత్రమే నిజమైన ప్రతినిధి అని పేర్కొన్న హరీష్ రావు, రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్ పాలనకు గట్టి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అన్నారం వార్డు నుంచి మున్సిపల్ కేంద్రం గుమ్మడిదల వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ – రోడ్ షోలో వేలాది మంది పాల్గొని బీఆర్ఎస్ పక్షాన నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. ప్రజల అపూర్వ స్పందనతో గుమ్మడిదల వీధులు జనసంద్రంగా మారాయి.రోడ్ షో అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో హరీష్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టడమే లక్ష ్యంగా అధికారంలోకి వచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఘాటుగా విమర్శించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ జెండాలతో, నినాదాలతో సభను ఉత్సాహంగా మలిచారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ రెడ్డి, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఎరుకలి సత్యనారాయణ, గుమ్మడిదల మున్సిపాలిటీ ఇంచార్జ్ పట్నం మాణిక్యం , తొంట అంజయ్య, గుమ్మడిదల మండల అధ్యక్షుడు కొత్తపల్లి

## ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటున్న జగ్గారెడ్డి..

**కొండాపూర్, ఫిబ్రవరి 08, ప్రభాతవార్త :** కొండాపూర్ మండల పరిధిలోని మన్సన్ పల్లి గ్రామానికి చెందిన మొదుసు మహేందర్ గత 15 రోజుల నుండి హిమోఫాగోసైటిక్ లింఫోహిస్టియోసైటోసిస్ అనే వ్యాధి తో బాధపడుతున్నట్లు తెలుసుకొని ఆదివారం టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, తన వంతు సాయంగా వైద్య ఖర్చుల నిమిత్తం రెండు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించాడని గ్రామ సర్పంచ్ సి. రామచంద్ర రెడ్డి అన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, తాను ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గం ప్రజలకు ఎల్లవేళల ఏ ఆపతి వచ్చిన నేను అండగా ఉంటానని ప్రజలకు భరోసా కల్పిస్తున్నాడు. ఒకవైపు నేను ఎమ్మెల్యేగా ఎప్పుడు పోటీ చేయను అంటూనే నియోజకవర్గం ప్రజలతో మమేకమై ఉంటూ ప్రజల కొరకు పాటుపడుతున్న నాయకుడు అన్నాడు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి.రామచందర్, ఉపాధ్యక్షులు బి మల్లేశం, యువజన అధ్యక్షులు నరేందర్, ఉప సర్పంచ్ శివశంకర్, వార్డు సభ్యులు నరసమ్మ బుచ్చయ్య, రామ గౌడ్, నాయకులు రాములు, యాదయ్య, బందయ్య, రఫీ, పరమయ్య, సాయి కుమార్ లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ,బిజెపి పార్టీల మాయ మాటలు నమ్మకండి

13వ వార్డు కౌన్సిలర్ గా అనసూయ అశోక్ గౌడ్ ను గెలిపించాలి

ఎమ్మెల్యే సునీత రెడ్డి

**నర్సాపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ,బిజెపి పార్టీల నాయకుల మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో బిఆర్ఎస్ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి అనసూయ అశోక్ గౌడు కు మద్దతుగా ఎమ్మెల్యే సునీత రెడ్డి ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి అనసూయ అశోక్ గౌడ్.కు కేటాయించిన బిఆర్ఎస్ గుర్తు కారు గుర్తుపై ఓటు వేసి కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డు అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. అనసూయ అశోక్ గౌడ్ కు రాజకీయంగా ఎంతో అనుభవం ఉందని మార్కెట్ కమిటీ చైర్మన్ గా ప్రజలకు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు ,ఆమె భర్త అశోక్ గౌడ్ నర్సాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ గా పనిచేసి నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని ఆమె అన్నారు. అభివృద్ధిని చూసి ప్రజలు అనసూయ అశోక్ గౌడ్ ను ఆశీర్వదించాలని అన్నారు రాజకీయంగా అనుభవమున్న కౌన్సిలర్ అభ్యర్థి అనసూయ అశోక్ గౌడ్ ను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే 13వ వార్డును అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. కాంగ్రెస్, బిజెపి నాయకులు ఓట్ల కోసం డబ్బులు ఇస్తే వారి దగ్గర తీసుకొని ఓటు మాత్రం బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలని వేయాలని ఆమె ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, బి ఆర్ ఎస్ నాయకులు వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్..

**నర్సాపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తేనే నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ అన్నారు. ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని 8 వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి చౌటి జగదీష్ కు మద్దతుగా 8 వ వార్డులో ఇంటింట ప్రచారం నిర్వహించి, 8 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి జగదీష్ కు కేటాయించిన చేతి గుర్తుపై ఓటు వేసి కౌన్సిలర్ గా గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్బంగా ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు .కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులను ప్రజలు ఓటు వేసి గెలిపిస్తే ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకువచ్చి నర్సాపూర్ మున్సిపాలిటీని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## ఐదు మున్సిపాలిటీలో విజయడంకా మోగిస్తాం

కేసీఆర్ కి బహుమతిగా అందిస్తాం

ఇంటింటి ప్రచారంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి

**పటాన్ చెరు , ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి బహుమతిగా అందిస్తామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని బచ్చుగూడెం, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ వార్డుల్లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరైన రోడ్ షోలలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రుద్రారం, ఇస్నాపూర్ వార్డులలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్ది కాలంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇస్నాపూర్, ఇంద్రేశం, గడ్డపోతారం, జిన్నారం, గుమ్మడిదల మున్సిపాలిటీల పరిధిలో ప్రతి వార్డును అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దామని అన్నారు. ఇంటింటి ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీకి అనూహ్య మద్దతు లభిస్తోందని, ఐదు మున్సిపాలిటీలలో భారీ విజయం నమోదు చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నం పెట్టినోళ్లకు ఓటు వేస్తారా..
## సున్నం పెట్టినోళ్లకు వేస్తారా

కాంగ్రెస్ ప్రభుత్వంలో బస్సు ఫ్రీ తప్ప, అన్ని హామీలు తుస్సు

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని ఇంద్రేశం మున్సిపాలిటీతో పాటు ఇస్నాపూర్ మున్సిపాలిటీ ప్రాంతాల్లో పటాన్ చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. అన్నం పెట్టినోళ్లకు ఓటు వేస్తారా లేకపోతే సున్నం పెట్టినోళ్లకు వేస్తారా ఆలోచించాలని ప్రజలను ప్రశ్నించారు. కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ కింద ఇంటింటికీ నల్లా కనెక్షన్లు అందించామని గుర్తు చేశారు. అలాగే ఇంద్రేశం నుంచి ఇస్నాపూర్ వరకు బచ్చుగూడెం మీదుగా కొత్త రోడ్డు వేసి ప్రజలకు సౌకర్యం కల్పించామని తెలిపారు. బచ్చుగూడెం వద్ద నక్కవాగు మీద వంతెన కూడా బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే నిర్మించామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విషయానికి వస్తే బస్సు ఫ్రీ తప్ప మిగతా అన్ని హామీలు తుస్సు అని, ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో పెళ్లి అయిన మహిళకు రావాల్సిన కళ్యాణ లక్ష్మి పథకం కూడా బిడ్డ పుట్టిన తర్వాతే ఇస్తున్నారు అంటూ కాంగ్రెస్ పాలనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీలతో పాటు పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అన్ని వార్డుల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీ ఇంచార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇంద్రేశం మున్సిపాలిటీ ఇంచార్జ్ గోసుల శ్రీనివాస్ యాదవ్, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆధర్శ్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఐదు మున్సిపాలిటీలో విజయడంకా మోగిస్తాం

**పటాన్ చెరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి బహుమతిగా అందిస్తామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని బచ్చుగూడెం, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ వార్డుల్లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరైన రోడ్ షోలలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రుద్రారం, ఇస్నాపూర్ వార్డులలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్ది కాలంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇస్నాపూర్, ఇంద్రేశం, గడ్డపోతారం, జిన్నారం, గుమ్మడిదల మున్సిపాలిటీల పరిధిలో ప్రతి వార్డును అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దామని అన్నారు.

## నాణ్యత పాటిస్తేనే హోటళ్లకు మనుగడ

**మునిపల్లి,ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త):** ఆహారం కలుషితం గాకుండా నాణ్యత పాటిస్తేనే హోటళ్ళకు మనుగడ ఉంటుందని జిల్లా ఆహార భద్రతాధికారి రాజేశ్వర్ అన్నారు. మునిపల్లి మండలంలోని కంకోల్ సమీపంలోని ఎఫ్ 3హోటల్ సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము వివిధ హోటళ్లు,రెస్టారెంట్ల తనిఖీల్లో భాగంగా ఎఫ్ 3 రెస్టారెంట్ని తనిఖీ చేయడం జరిగిందన్నారు.చికెన్‌తో పాటు వివిధ రకాలైన వంటకాలను పరిశీలించామన్నారు.సమీపంలోని యూనివర్సిటి విద్యార్థులను హోటల్ ఆహార పదార్థాలపై అరాతీయగా వంటకాల పట్ల సానుకూల సమాధానమిచ్చారన్నారు.అక్కడ టేస్టీ సాల్ట్ గాని, ఫుడ్ కలర్స్ గాని వాడటం లేదని తెలిందన్నారు. హోటళ్లలో నాణ్యమైన పదార్థాలను వాడాలని లేనియెడల చట్ట పరమైన చర్యలు తీసుకోబడుతాయన్నారు.



16వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి

## కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం తధ్యం

**-కాంగ్రెస్ నేతలు గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి**

**జహీరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజాసంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని సెట్విన్ చైర్మన్ నందారం గిరిధర్‌రెడ్డి, నేత డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం పట్టణంలోని 3వ వార్డు (శ్రీధర్‌రెడ్డి), 13లో (సయ్యద్ అతీకుర్ రెహ్మాన్ సయ్యద్ బకర్ హక్కానీ), 16లో (మౌనిక శేఖర్), 27లో (ప్రియాంక జగదీశ్), 22లో (జలాలుద్దీన్), , 32లో లక్ష్మీ మహిపాల్‌రెడ్డి), 37లో (మాదవిరెడ్డి)వ వార్డులలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డిలు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులకు కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులను ఓట్లతో మద్దతు పలికి మున్సిపల్ తలుపులు తట్టేలా చేయాలని సూచించారు. ఆయా వార్డులలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు లాంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రజలకు హామి చేశారు. ఎన్నికల ప్రచారంలో పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, నాయకులు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రారెడ్డి నగర్ కాలనీ నూతన కార్యవర్గం

**-కార్పొరేటర్‌ను సన్మానించిన అధ్యక్షులు మల్లారెడ్డి**

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు వెన్నవరం మల్లా రెడ్డి తన కార్యవర్గాన్ని విస్తరించారు. కాలనీ జనరల్ సెక్రటరీగా పి విశ్వనాథ్ రావు, గౌరవ అధ్యక్షులుగా జగన్నాత్ రెడ్డి, వరింగ్ ప్రెసిడెంట్‌గా పి శ్రీనివాస్‌రెడ్డి, బి వీరారెడ్డి, జి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా డి విష్ణువర్ధన్‌రెడ్డి, జే విఠల్‌రెడ్డి, బూరుగడ్డ రాకేష్ రాజ్, కోశాధికారిగా ఏ మహిపాల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి సంతోష్‌రెడ్డి, ఏ రాహుల్‌రెడ్డి, టిరాజశేఖర్, జీ సంజీవరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా పి రామకృష్ణరెడ్డి, కె గోపాల కృష్ణ, కె శ్రీనివాస్, శ్యామ్ సుందర్, కల్చరల్ సెక్రటరీగా యు పెంటయ్య, పి సురేందర్‌రెడ్డి, డి పాండురంగారెడ్డి, ఏ రాజయ్య, పి జనార్ధన్‌రెడ్డి, కె వీరస్వామి, పి అశోక్‌రెడ్డి, పి శ్రీనివాస్‌గౌడ్, ఎన్ శివరామకృష్ణ, డిఆర్కె రెడ్డిలను ఎంపిక చేయగా కార్పోరేటర్ పుష్పనగేష్ బాధ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపగా కార్యవర్గ సభ్యులు కార్పోరేటర్‌ను సన్మానించారు.



కార్పోరేటర్ పుష్పనగేష్‌ను సన్మానిస్తున్న నూతన కార్యవర్గం సభ్యులు



నామకరణ మహోత్సవంలో చిన్నారిని ఆశీర్వదిస్తున్న రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ శెట్కార్

## చిన్నారిని ఆశీర్వదించిన రాకేష్ శెట్కార్

**మనూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తోర్నాల గ్రామానికి చెందిన రవి శంకర్ పాటిల్ మనవడి నామకరణ మహోత్సవంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ శెట్కార్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగమేష్ పాటిల్, బస్వరాజ్ పాటిల్, మాజీ సర్పంచ్ సంగారెడ్డి, శుఉశప్ప, సంగయ్యస్వామి, శివయ్య స్వామి, ఆనంద్, హాఫీజ్, సంతు, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

### పద్మశాలీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి

**మనోహరాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** పద్మశాలీల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని పద్మశాలీల సంఘం నాయకులు బొమ్మ బాలకిషన్, గుండు సత్యనారాయణ, పుండరీకం, బాలకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పద్మశాలీ సంఘం సమావేశం నిర్వహించారు. పద్మశాలీల ఓట్లతో గద్దెనెక్కిన నాయకులు ప్రభుత్వం పద్మశాలీల అభివృద్ధికి పాటుపడకుండా పట్టించుకోవడం లేదని విమర్శించారు. పద్మశాలీల ఆర్థిక అభివృద్ధికి వెంటనే ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. మున్సిపాలిటి ఎన్నికలలో పోటీ చేస్తున్న పద్మశాలీ సభ్యులను పద్మశాలీలు ఐక్యమత్యంతో ఉండి వారిని గెలుపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్, గుండు శ్రీకాంత్, శేషు, రవీందర్, వెంకట్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం నాయకులు.

# ప్రచారం హీటు.. విమర్శలు ఘాటు

- మున్సిపల్ ఎన్నికల్లో హీట్ ఎక్కిన కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల ప్రచారం
- రాజకీయ డ్రామాలు చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు
- ప్రత్యర్థులను ఎన్నికల ప్రచారం నిర్వహించొద్దని ప్రలోభాలకు గురి చేస్తున్న వైనం...!
- మున్సిపల్ చైర్మన్ రేసులో 17వ వార్డు కీలకం
- గులాబి జెండా ఎగరేసేందుకు ప్రత్యేక సన్నాహాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్
- మున్సిపల్ పీఠంపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పెషల్ ఫోకస్
- ఎన్నికల్లో ఎవరు గెలిచినా చైర్మన్ కాంగ్రెస్ అభ్యర్థేనా...!?

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో రోజురోజుకు ఉత్కంఠభరితంగా మారుతున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీల మధ్య ప్రచారం హీట్ ఎక్కింది. కౌన్సిలర్ అభ్యర్థుల స్థాయిలో రాజకీయ డ్రామాలు నడుస్తుండటంతో పట్టణ రాజకీయాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి.

ఎన్నికల ప్రచారం సందర్భంగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారంటూ ఇరుపార్టీల నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. ప్రత్యేక దానాలు, హామీల పేరుతో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరుగుతున్నాయనే వాదనలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. దీనిపై ఎన్నికల అధికారులు నిఘా పెట్టకపోవడం విడ్డూరంగా ఉంది.

ఇదిలా ఉంటే హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ రేసులో కాంగ్రెస్ పార్టీకి 17వ వార్డు కీలకంగా మారింది. ఈ వార్డు ఫలితాలే చైర్మన్ పీఠాన్ని నిర్ణయించే స్థాయికి చేరుకున్నాయి. గులాబీ జెండా ఎగరేసేందుకు బిఆర్ఎస్ ప్రత్యేక సన్నాహాలు చేస్తుండగా, పార్టీ నాయకులు, శ్రేణులు సమీకరణాల్లో నిమగ్నమయ్యారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వ్యూహాత్మకంగా ప్రచారం సాగుతుండగా,మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మున్సిపల్ పీఠంపై మంత్రి ప్రస్తుత శాసనసభ్యులు, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కౌన్సిలర్ అభ్యర్థుల విజయంతో పాటు చైర్మన్ పదవి కాంగ్రెస్ ఖాతాలోనే ఉండాలనే లక్ష్యంతో అధిష్ఠానం వ్యూహాలు అమలు చేస్తోంది.

ఈ నేపథ్యంలో ఎన్నికల్లో ఏ పార్టీకి చెందిన అభ్యర్థులు ఎవరు గెలిచినా, చివరికి చైర్మన్ పదవి కాంగ్రెస్ అభ్యర్థికే దక్కుతుందా, లేక బిఆర్ఎస్ వ్యూహాలు ఫలిస్తాయా అన్నది హుస్నాబాద్ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. పోలింగ్ ముగిసేవరకు ఉత్కంఠ కొనసాగనుంది.

**మున్సిపల్ ఎన్నికల్లో హీట్ ఎక్కిన కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రచారం...**

హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణ కేంద్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ వేడి రోజురోజుకు పెరుగుతోంది. పట్టణంలోని వార్డులన్నింటిలో రెండు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకర్షించేందుకు పోటీ పడుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీలు, స్థానిక అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రచారం చేపట్టారు. గత బిఆర్ఎస్ పాలనలో పట్టణం ఎదుర్కొన్న సమస్యలను గుర్తు చేస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించేది కాంగ్రెస్ పార్టీనేనని నేతలు పేర్కొంటున్నారు.

ఇదే సమయంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తమ హయాంలో హుస్నాబాద్ మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు గుర్తు చేస్తున్నారు. తాగునీరు, రహదారులు, గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు పారిశుధ్యం, నూతన ప్రభుత్వ భవనాలు వంటి అంశాల్లో చేసిన అభివృద్ధిని వివరిస్తూ మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు పూర్తిగా అమలు చేయలేదని విమర్శలు గుప్పిస్తున్నారు.

ప్రచారంలో భాగంగా రెండు పార్టీల నేతలు ఇంటింటి ప్రచారం, ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తూ ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. దీంతో హుస్నాబాద్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికలు అత్యంత ఆసక్తికరంగా మారాయి.

ఎవరికి ప్రజలు పట్టం కడతారన్నది పోలింగ్ రోజున తేలనుండగా అప్పటివరకు కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య హీట్ ప్రచారం మరింత ఉధృతంగా కొనసాగనున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**మున్సిపల్ చైర్మన్ రేసులో 17వ వార్డు కీలకం...**

హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో 17వ వార్డు ఈసారి రాజకీయంగా అత్యంత కీలకంగా మారింది. ఈ వార్డు నుంచే కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్మన్ అభ్యర్థి పోటీ పడుతుండటంతో పట్టణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

17వ వార్డు ఫలితం ఆధారంగా హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎవరు అన్నది తేలనుండటంతో, అన్ని పార్టీల దృష్టి ఈ ఒక్క వార్డు పైనే కేంద్రీకృతమైంది. ఈ వార్డు ఎన్నికల ఫలితాలు పట్టణ రాజకీయ భవిష్యత్తును నిర్దేశించనున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**గులాబి జెండా ఎగరేసేందుకు ప్రత్యేక సన్నాహాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్....**





హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం దృశ్యం

అభివృద్ధే అజెండాగా మున్సిపాలిటీలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బిఆర్ఎస్ పార్టీ తన రాజకీయ వ్యూహాలను వేగవంతం చేసింది. ఈనేపథ్యంలో ఈ ప్రాంత మాజీ శాసనసభ్యులు గతంలో మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులనే ప్రధాన అజెండాగా తీసుకుని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

**మున్సిపల్ పీఠంపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పెషల్ ఫోకస్...**

హుస్నాబాద్ మున్సిపాలిటీలో జరగనున్న ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగా స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయం సాధించి, పట్టణాభివృద్ధిపై తన ముద్ర వేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ నాయకత్వం వ్యూహాలను సిద్ధం చేస్తోంది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శిస్తూ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అభివృద్ధి పనులకు వేగం పెంచుతామని హామీ ఇస్తున్నారు.

మొత్తంగా హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతుండటంతో పట్టణ రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి.

**రాజకీయ డ్రామాలు చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు...!?**

హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం విపరీతంగా వేడెక్కుతోంది. ప్రచారంలో ఆరోపణలు, ప్రత్యారోపణలతో పాటు తెరవెనుక రాజకీయ డ్రామాలు జరుగుతున్నాయని ఆయా పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు.

మొత్తానికి హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికలు రాజకీయ ఉత్కంఠతో పాటు ఆరోపణల కేంద్రంగా మారుతుంది.

# ఖేడ్ మున్సిపల్ పీఠం పైన గులాబీ జెండా ఎగరవేస్తాం

**..ఇంటింటి ప్రచారం చేసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి,**
**మాజీ జడ్పీ చైర్మన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి**

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నారాయణఖేడ్ మున్సిపాలిటీలో 2, 3, 4 వ వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి ఓటర్లును కోరారు. 2వ వార్డు అభ్యర్థిగా మంజుల దుర్గయ్య కారు గుర్తుకు, 3వ వార్డు అభ్యర్థిగా స్వప్న అభిషేక్ షెత్కార్ గారి కారు గుర్తుకు, 4వ వార్డు అభ్యర్థిగా అభిషేక్ షెత్కార్ గారి కారు గుర్తుకు, ఓట్లను వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ... నారాయణఖేడ్ పట్టణంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ ఆయాంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గల్లి గల్లికి సిసి రోడ్లను, ప్రతి ఇంటికి తాగడానికి నల్ల కలెక్షన్లు ఇచ్చి నీటిని అందించిన ఘనత మాకే దక్కుతుందని తెలిపారు. నారాయణఖేడ్ పట్టణంలో 100 పడకల ఆసుపత్రి, ఆక్సిజన్ పార్క్, ఏర్పాటు చేశామని తెలిపారు.



ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి.

### జోరుగా కొనసాగిన కాంగ్రెస్ ప్రచారం

**..అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు...**
**..పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి**

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** నారాయణఖేడ్ మున్సిపాలిటీ లో గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నారాయణఖేడ్ మున్సిపల్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి గజ్జెల కాంతం ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా 3, 4,వ వార్డ్ లలో విస్తృతంగా పర్యటించి, కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి.

అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నారాయణఖేడ్ పట్టణంలో చేపట్టిన పనుల గురించి ప్రజలకు వివరించారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి, నారాయణఖేడ్ పట్టణంలో కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని నారాయణఖేడ్ పట్టణ ప్రజానీకానికి ఎంపీ, ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అభ్య ర్థులు, మున్సిపల్ పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టండి

### పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 4 కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న చేపట్టనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసి, కార్మిక వ్యతిరేక చట్టాలను తరిమికొట్టాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. ఆదివారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయం ఆవరణలో నూతన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన సమ్మె సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ఆర్థిక రంగానికి వెన్నుముకగా నిలుస్తున్న కార్మిక రంగానికి వెన్నుపోటు పొడుస్తూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 29 పాత కార్మిక చట్టాలను రద్దుచేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా నూతనంగా నాలుగు కార్మిక చట్టాలను తీసుకొని రావడం దుర్మార్గం అన్నారు. ప్రధానంగా పారిశ్రామిక సంబంధాల కోడ్ లోని నిబంధనల వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతింటుందని, పెద్దసంస్థల్లో కూడా ప్రభుత్వ అనుమతి లేకుండా ఉద్యోగులను తొలగించే అవకాశం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలను పెంచే అవకాశం ఉండడం వల్ల కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవితం ప్రభావితమవుతుందని తెలిపారు. వచ్చే సంవత్సరం నుండి నుంచి దేశవ్యాప్తంగా కార్మికులపై బలవంతంగా రుద్దుతున్న లేబర్ కోడ్ లు ప్రస్తుత 29 కార్మిక చట్టాల ద్వారా పొందుతున్న కనీస హక్కులను రద్దు కాబోతున్నాయని అన్నారు. న్యాయస్థానాల ద్వారా పొందే హక్కును సైతం నూతన లేబర్ కోడ్స్ నిరాకరిస్తున్నాయని అన్నారు. పాత కార్మిక చట్టాల్లో కనీస వేతనం నిర్ణయించే అంశం కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి అంశంగా ఉందని, నూతన లేబర్ కోడ్ లలో రాష్ట్రాల హక్కులు తొలగించడం బాధాకరమన్నారు. ఇక నుండి కేంద్రం కనీస వేతనాలు నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న వేతనాలు ఇకపై కేంద్ర ప్రభుత్వ దయా దాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా చెందిన పటాన్ చెరు నియోజకవర్గంలో నూతన చట్టాలు కార్మికుల పాలిట ఆశనిపాతంగా మారబోతున్నాయని అన్నారు. నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టబోతున్న సార్వత్రిక సమ్మెలో ప్రతీ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, బిఆర్టియు రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండా మనోహర్, బిఆర్టియు జిల్లా అధ్యక్షులు శివశంకర్ రావు, సీనియర్ కార్మిక నాయకులు నరేందర్, రవి, రావు, లక్ష్మారెడ్డి, సాంబశివరావు, అశోక్, ఖాజా మొయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో వుండి సేవ చేస్తా

### వడ్ల మహేశ్వరి

**సదాశివపేట,ఫిబ్రవరి 8, (ప్రభాతవార్త):** సదాశివపేట మున్సిపాలిటి 22వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి వడ్ల మహేశ్వరీ గెలుపు దిశగా పయనిస్తున్నారు. రాఘవేంద్రనగర్,శ్రీరాంనగర్ ఓటర్లు ఆమెకు బ్రహ్మరథం పడు తున్నారు.తాను వార్డు ప్రజలకు అందుబాటులో వుండి సేవ చేస్తానని అంటున్నారు.ఆదివారం నాడు బిఆర్ఎస్ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొని తనకు ఓటు వేసి గెలిపిస్తే తాను ఐదు సంవత్సరాలలో అందరికి అందు బాటులో వుండి సేవకురాలిగా పనిచేస్తానని ఆమె హామీనిస్తున్నారు.ఈ సందర్భంగా ఆమె భర్త,పట్టణ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి వీరేశం మాట్లాడుతూ తాను తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితులై 2008లో టిఆర్ఎస్‌లో చేరి యువత అద్యక్షుడిగా ,పట్టణ ప్రధాన కార్యదర్శిగా,అందరి సహాయ సహకారాలతో 8వ వార్డు కౌన్సిలర్‌గా గెలిచి వార్డులో వివిధ అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. అందరి సహాయ సహ కారాలు ఇప్పటివరకు అందించారని ఇకముందు కూడా అందిస్తారని ఆశిస్తున్నానన్నారు.తనకు ప్రజల పక్షాన పోరాటం చేయడం, ప్రజల పక్షాన నిలబడడం అలవాటుగా మారిందన్నారు.శక్తికి మించిన హామీలు తనతో కాదని, నేను ఆచరణ సాధ్యమైనటువంటి హామీలను మాత్రమే మీ ముందుకు తీసుకు వస్తున్నానన్నారు.శ్రీరామ్‌నగర్ కాలనీ,రాఘవేంద్ర నగర్ కాలనీ ప్రజలకు ఏది అవసరం ఉంది అన్న విషయం తనకు బాగా తెలుసని, ఇక్కడి ప్రజలు విజ్ఞులు , విజ్ఞానవంతులు, ప్రతి రూపాయి విలువ ఇక్కడి ప్రజలకు బాగా తెలుసన్నారు. శ్రీరామ్ నగర్ కాలనీ ప్రజలకు బస్టాండ్ వైపు రావాలంటే రాంగ్ రూట్ మాత్రమే ఉందని, గత్యంతరం లేకుండా రాంగ్ రూట్లోనే ప్రయాణం చేస్తూ,ప్రమాదాలకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే యూటర్న్ ఏర్పాటు చేస్తానన్నారు.



వడ్ల మహేశ్వరీ గెలుపు కోసం ప్రచారం చేస్తున్న మహిళలు

**గడువు సమీపిస్తుండటంతో ఎన్నికల కోలాహలం**

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి రెండు రోజుల్లో తెర పడనుండటం తో సంగారెడ్డి మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం ఇతర పార్టీలు స్వతంత్ర అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేయడంతో సంగారెడ్డి పట్టణం ఎన్నికల ప్రచారంతో ఓరెత్తుతోంది ఇంటింటా ప్రచారంతో పాటు వాహనాల ప్రచారంతో నాయకుల ర్యాలీలతో సంగారెడ్డి పట్టణంలో ఎన్నికల కోలాహలం నెలకొంది.ఆదివారం టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థుల తరపున పట్టణం లో ని 11,31,32,33,6 వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రతీ వార్డులో 8 కోట్ల రూపాయల తో అభివృద్ధి చేయడం తో పాటు వార్డులో ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో ఆయా వార్డుల అభ్యర్థులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### హోరెత్తిస్తున్న ఎన్నికల ప్రచారం







సైడ్ ప్రొటెక్షన్ కమిటీని సన్మానిస్తున్న గ్రామస్థుల దృశ్యం

## బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించండి

**-గ్రామ సర్పంచ్ దేవసోత్ శంకర్**

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** బాల్య వివాహాల నిర్మూలించి బాలల హక్కులను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని నడిమితాండ సర్పంచ్ దేవసోత్ శంకర్ అన్నారు. మండల పరిధిలోని నడిమితండాలో బాలల పరిరక్షణ కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవసోత్ శంకర్ మాట్లాడుతూ బాల్య వివాహాలతో బాలికలు అనేక అనారోగ్యాలకు గురవుతారని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండితేనే వివాహాలు చేయాలని సూచించారు. సుకన్య సమృద్ధి యోజన పథకంపై ప్రతి ఒక్కరు అవగాహన పొంది ఉండాలన్నారు. 10 సంవత్సరాల లోపు ఉన్న బాలికలు పథకంలో చేరవచ్చుని, పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడి టీచర్ నాగమణి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే 100కు లేదా 1098కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి జనార్ధన్, ఉప సర్పంచ్ దేవసోత్ శాంకీ బాయి, శిశు సంక్షేమ శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ కవిత, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడి టీచర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గురువన్నపేటలో ఉచిత వైద్య శిబిరం

**కొమురవెల్లి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వహకులు తెలిపారు. మండల పరిధిలోని గురువన్నపేటలో ఆదివారం గజ్వేల్ పల్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు భూమి పూజ

**కొమురవెల్లి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాంసాగర్ గ్రామంలో ఆదివారం సర్పంచ్ అక్కెనపల్లి రాజ్యలక్ష్మి మల్లారెడ్డి చేతుల మీదుగా గ్రామాభివృద్ధిలో భాగంగా పాఠశాల ప్రహరీ గోడ పునర్నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎసిరెడ్డి మల్లారెడ్డి, వార్డు సభ్యులు, విద్యా కమిటీ చైర్మన్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం



## అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శ్రీకారం

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయి జ్యోతి నగర్ కాలనీ బస్ డిపో నుంచి ఉస్మాబావి వంతెన వరరకు రోడ్డు అస్థవ్యస్థంగా మారడంతో కాలనీ వాసుల వినతి మేరకు 42 లక్షలతో సిసి రోడ్డు, 16.50 లక్షలతో చైన్ లింక్ మెష్ పనుల నిర్మాణానికి ఆదివారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటి సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాలనీ అభివృద్దే లక్ష్యంగా పాలన సాగిస్తున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.